సాక్షి

కాకినాడ

మంగళవారం । 4 । జూన్ । 2024



రూ.1,00,116 విరాళం

ఆత్రేయపురం: వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి క్షేత్రంలో అన్నదాన భవన నిర్మాణానికి మన్నె అశోక్ గణపతిరాజు (కలిదిండి) సోమవారం రూ.1,00,116 విరాళం సమర్పించారు.



నిత్యాన్నదానానికి రూ.1,01,511

అన్నవరం: సత్యదేవుని నిత్యాన్నదాన పథకానికి తాడికొండ ప్రవీణ్‌కుమార్ దంపతులు (ఒడిశా రాష్ట్రం గంజాం) సోమవారం రూ.1,01,511 విరాళం సమర్పించారు.

గరిష్టం/కనిష్టం 36.0°/24.3°

	గరిష్టం	కనిష్టం
రాజమహేంద్రవరం	33.0	27.0
కాకినాడ	36.0	24.3
అమలాపురం	36.0	28.0

న్యూస్‌రీల్

కౌంటింగ్ సిబ్బంది రెండో దశ ర్యాండమైజేషన్



ర్యాండమైజేషన్ ప్రక్రియలో పాల్గొన్న కలెక్టర్ నివాస్ తదితరులు

కాకినాడ సిటీ: ఓట్ల లెక్కింపు సిబ్బంది రెండో దశ ర్యాండమైజేషన్ ప్రక్రియ కలెక్టరేట్ ఎన్ఐసీ సెంటర్‌లో సోమవారం నిర్వహించారు. జిల్లాలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలకు నియమితులైన పరిశీలకుల సమక్షంలో జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ జె.నివాస్, జాయింట్ కలెక్టర్, పిఠాపురం రిటర్నింగ్ అధికారి (ఆర్ఓ) ఎస్.రామ్‌సుందర్‌రెడ్డితో కలసి ఈ ప్రక్రియ నిర్వహించారు. ఓట్ల లెక్కింపు ప్రక్రియలో పాల్గొనే కౌంటింగ్ సూపర్‌వైజర్లు, కౌంటింగ్ అసిస్టెంట్లు, మైక్రో అబ్జర్వర్లకు ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు రెండో దశ ర్యాండమైజేషన్ నిర్వహించామని కలెక్టర్ నివాస్ తెలిపారు. ఈ ప్రక్రియ ద్వారా కాకినాడ పార్లమెంటరీ నియోజకవర్గంతో పాటు ఏడు అసెంబ్లీ సెగ్మెంట్ల కౌంటింగ్ కేంద్రాలకు సిబ్బందిని కేటాయించడం పూర్తయ్యిందని చెప్పారు. ఈ సిబ్బందికి వారికి కేటాయించిన కౌంటింగ్ కేంద్రాల్లో ఓట్ల లెక్కింపు ప్రక్రియపై శిక్షణ ఇస్తామని తెలిపారు. కార్యక్రమంలో ట్రైనీ కలెక్టర్ హెచ్ఎస్ భావన, డీఆర్ఓ డి.తిప్పేనాయక్, సీపీఓ పి.త్రినాథ్, జిల్లా ఉపాధి, శిక్షణ అధికారి జి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

రంగరాయ, ఐటీఐకి నేడు సెలవు

కాకినాడ సిటీ: జేఎన్‌టీయూకేలో ఓట్ల లెక్కింపు జరుగుతున్న సందర్భంగా కాకినాడ రంగరాయ వైద్య కళాశాల, ప్రభుత్వ ఐటీఐలకు స్థానిక సెలవు ప్రకటించారు. జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ జె.నివాస్ సోమవారం ఒక ప్రకటనలో ఈ విషయం తెలిపారు. ఓట్లు లెక్కింపు సందర్భంగా కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేసినందున రంగరాయ మెడికల్ కళాశాలకు, ప్రభుత్వ ఐటీఐకి ఉద్యోగులు, విద్యార్థులు వెళ్లే అవకాశం లేదన్నారు. ఈ నేపథ్యంలో ఈ రెండు సంస్థలకు స్థానిక సెలవు ప్రకటించామని కలెక్టర్ తెలిపారు.

నూకాలమ్మ తల్లికి రూ.14.86 లక్షల ఆదాయం



హుండీల సొమ్ము లెక్కిస్తున్న సిబ్బంది, భక్తులు

పెద్దాపురం: కాండ్రకోట నూకాలమ్మ అమ్మవారికి హుండీల ద్వారా 37 రోజులకు గాను రూ.14,86,286 ఆదాయం సమకూరింది. దేవదాయ శాఖ తనిఖీ అధికారి వాడ్రేవు సురేష్ కుమార్ సమక్షంలో ఆలయ హుండీలను సోమవారం తెరచి ఆదాయం లెక్కించారు. ఏటా అమ్మవారి జాతర ముగిసిన అనంతరం హుండీల ఆదాయం లెక్కిస్తామని ఆలయ కార్యనిర్వహణాధికారి తలాటం వెంకట సూర్యనారాయణ తెలిపారు. కార్యక్రమంలో మహారాణి సత్రం ఈఓ కాట్నం జగన్మోహన శ్రీనివాస్, ఆలయ కమిటీ చైర్మన్ గవరసాని వీరాస్వామి, సభ్యులు పాల్గొన్నారు.

నేడే ప్రజాతీర్పు

- ఓట్ల లెక్కింపునకు జేఎన్‌టీయూకేలో పూర్తయిన ఏర్పాట్లు
- 8 గంటలకు ప్రారంభం
- 9.30 గంటలకు తొలి రౌండ్ ఫలితం
- మధ్యాహ్నం 3 గంటలకు మొదటిగా పెద్దాపురం ఫలితం
- చివరిగా తేలనున్న కాకినాడ రూరల్
- సుదీర్ఘ ఉత్కంఠకు నేటితో తెర

సాక్షి ప్రతినిధి, కాకినాడ: సార్వత్రిక ఎన్నికల ఫలితాల కోసం మూడు వారాలకు పైబడి కొనసాగుతున్న నరాలు తెగే ఉత్కంఠకు మరికొద్ది గంటల్లో తెర పడనుంది. గత నెల 13న జిల్లాలోని కాకినాడ లోక్‌సభ, ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలకు జరిగిన ఎన్నికల్లో రికార్డు స్థాయిలో 80.30 శాతం పోలింగ్ నమోదైంది. ఈ ఓట్ల లెక్కింపు మంగళవారం జరగనుంది. దీని కోసం అధికార యంత్రాంగం జేఎన్‌టీయూకేలో ఏర్పాట్లు పూర్తి చేసింది. అభ్యర్థుల తలరాతలు మార్చే ఈ ఫలితాల కోసం అటు రాజకీయ పార్టీల నాయకులతో పాటు ఇటు ప్రజలు కూడా ఎంతో ఆత్రంగా ఎదురు చూస్తున్నారు. జిల్లాల పునర్విభజన తరువాత జరిగిన తొలి సార్వత్రిక ఎన్నికల్లో విజేతలు ఎవరనే విషయమై ఓట్ల లెక్కింపు ప్రారంభమైన నాలుగైదు గంటల కల్లా కొంత వరకూ స్పష్టత వస్తుందని అధికారులు అంచనా వేస్తున్నారు.

వైఎస్సార్ సీపీ ధీమా

గెలుపు ఓటములపై ఎవరి అంచనాల్లో వారున్నారు. కులం, మతం, పార్టీ, ప్రాంతం, వర్గం వంటివేవీ చూడకుండా అర్హతే ప్రామాణికంగా అమలు చేసిన సంక్షేమ పథకాలతో తమ పార్టీ విజయదుందుభి మోగిస్తుందని వైఎస్సార్ సీపీ నేతలు ధీమా వ్యక్తం చేస్తున్నారు. మీ ఇంటిలో మంచి జరిగి ఉంటేనే ఓటీయండని ధైర్యంగా అడిగిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి మాటలను ప్రధానంగా మహిళలు ఓట్ల రూపంలో నిజం చేసి చూపించారని, ఈ ప్రభావం ఫలితాల్లో స్పష్టంగా కనిపించనుందని వారు అంచనా వేస్తున్నారు. పోలింగ్ రోజున రాత్రి 10 గంటలైనా బారులు తీరి నిలుచుని మరీ మహిళలు ఇచ్చిన తీర్పు మైలురాయిలా నిలిచిపోతుందంటున్నారు. పట్టణాలు, పల్లెలు అనే వ్యత్యాసం లేకుండా నమోదైన పోలింగ్ సరళిని పరిశీలిస్తే కచ్చితంగా ఈ ఫలితాల్లో వైఎస్సార్ సీపీ ప్రభంజనం సృష్టించడం ఖాయమని విశ్లేషిస్తున్నారు. తెల్లవారకుండానే తలుపు తట్టి వలంటీర్లు అందించిన పింఛన్లు అందుకున్న వృద్ధులు, వికలాంగులు.. డ్వాక్రా రుణ మాఫీతో ప్రయోజనం పొందిన స్వయంశక్తి సంఘాల మహిళలు.. ఆరోగ్యశ్రీతో ప్రాణాలు నిలబెట్టుకున్న వారి బంధువులు.. ఇలా ఒకరనేమిటి! ప్రభుత్వం ద్వారా లబ్ధి పొందిన అన్ని వర్గాల ప్రజలూ ఏకతాటిన ఓటేసి కీలకమైన తీర్పు ఇవ్వనున్నారని అంటున్నారు. ఎగ్జిట్, పోస్ట్ పోల్ ఫలితాల్లో ఇదే విషయం ప్రస్ఫుటమైందని చెబుతున్నారు.

తొలి ఫలితం పెద్దాపురం

జిల్లావ్యాప్తంగా 18,470 మంది పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు వేశారు. ఈ ఓట్ల లెక్కింపునకు 32 టేబుళ్లు ప్రత్యేకంగా ఏర్పాటు చేశారు. దీనికోసం 32 మంది అదనపు ఏఆర్‌ఓలు, 39 మంది పర్యవేక్షకులు, 78 మంది కౌంటింగ్ అసిస్టెంట్లు, 39 మంది మైక్రో అబ్జర్వర్లను నియమించారు. ఈ ఓట్ల లెక్కింపును ఉదయం 8 గంటలకు ప్రారంభిస్తారు. అనంతరం 8.30 గంటలకు ఈవీఎం ఓట్ల లెక్కింపు మొదలవుతుంది. ఒక్కో టేబుల్‌పై ఒక్కో ఈవీఎం చొప్పున ఒక్కో రౌండులో 14 టేబుళ్లపై 14 ఈవీఎం ఓట్లను లెక్కిస్తారు. ఉదయం 9.30 గంటలకు తొలి రౌండ్ ఫలితం వెలువడే అవకాశం ఉంది. అనంతరం ప్రతి రౌండ్ ఫలితం తేలడానికి అరగంట సమయం పడుతుంది. ప్రతి రౌండ్ పూర్తయిన వెంటనే వచ్చిన ఫలితాలను ఎన్నికల సంఘానికి చెందిన ఎన్ కోర్‌లో ఆర్‌ఓ అప్‌డేట్ చేస్తుంటారు. నియోజకవర్గంలోని పోలింగ్ కేంద్రాల సంఖ్య ఆధారంగా ఓట్ల లెక్కింపు రౌండ్ల సంఖ్యను నిర్ణయించారు. జిల్లాలో తక్కువగా 201 పోలింగ్ కేంద్రాలున్న పెద్దాపురం నియోజకవర్గ ఓట్ల లెక్కింపు 15 రౌండ్లలో పూర్తవుతుంది. దీని తుది ఫలితం మధ్యాహ్నం 3 గంటల సమయంలో తొలిగా విడుదల కానుంది. మిగిలిన నియోజకవర్గాల తుది ఫలితాలు సాయంత్రం 4 గంటల తరువాత వెలువడతాయని అంటున్నారు. అత్యధికంగా 264 పోలింగ్ కేంద్రాలున్న కాకినాడ రూరల్ ఫలితం 19 రౌండ్లు పూర్తయ్యాక కానీ వెల్లడి కాదు. జిల్లాలో ఇదే చివరి ఫలితం అవుతుందని చెబుతున్నారు. ఇది తేలేసరికి సాయంత్రం అవుతుందని అధికారులు అంటున్నారు.

7 గంటలలోపే రావాలి

ఎన్నికల ఓట్ల లెక్కింపు ప్రక్రియకు హాజరయ్యే అభ్యర్థుల ఏజెంట్లు, కౌంటింగ్ అధికారులు, సిబ్బంది మంగళవారం ఉదయం 7 గంటలలోగా జేఎన్‌టీయూకేలోని తమ తమ కౌంటింగ్ కేంద్రాలకు చేరుకోవాలి. ఒక్క నిమిషం ఆలస్యమైనా అనుమతి ఉండదు. ఎన్నికల కమిషన్ అనుమతి పత్రాలు పొందిన సిబ్బంది, ఏజెంట్లు, అభ్యర్థులకు మాత్రమే కౌంటింగ్ హాలులోనికి అనుమతి ఉంటుంది. భద్రతా చర్యల్లో భాగంగా కౌంటింగ్ కేంద్రాల్లోనికి ప్రవేశించే ప్రతి ఒక్కరికీ ముందు జాగ్రత్తగా డగ్స్, బ్రీత్ ఎనలైజర్ పరీక్షలు నిర్వహిస్తారు. డ్రగ్స్ తీసుకున్నట్లు, మద్యం తాగినట్లు నిర్ధారణ అయితే అటువంటి వారి అనుమతి రద్దు చేస్తారు.



కౌంటింగ్ అధికారుల సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ నివాస్

ఏర్పాట్లు పూర్తి

కాకినాడ సిటీ: ఓట్ల లెక్కింపునకు అన్ని ఏర్పాట్లూ పూర్తి చేశామని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ జె.నివాస్ తెలిపారు. జేఎన్‌టీయూకేలో తుని, కాకినాడ సిటీ, కాకినాడ రూరల్, జగ్గంపేట, ప్రత్తిపాడు నియోజకవర్గాల కౌంటింగ్ కేంద్రాల వద్ద కౌంటింగ్ సూపర్‌వైజర్లు, అసిస్టెంట్లు, మైక్రో అబ్జర్వర్ల తుది దశ శిక్షణను, ఓట్ల లెక్కింపు ఏర్పాట్లను ఆయన మంగళవారం రాత్రి పరిశీలించారు. ఓట్ల లెక్కింపులో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, కౌంటింగ్ సిబ్బందికి కేటాయించిన టేబుళ్ల వద్దనే నమూనా ఓట్ల లెక్కింపు ప్రక్రియపై శిక్షణ ఇచ్చామని చెప్పారు. జిల్లాలో నమోదైన 18 వేలకు పైగా పోస్టల్ బ్యాలెట్ ఓట్లను జేఎన్‌టీయూకేలోని స్ట్రాంగ్ రూములకు తరలించామన్నారు. పార్లమెంటరీ నియోజకవర్గం మొదటి రౌండ్ ఫలితం 9.30 గంటలకు వెలువడే అవకాశం ఉందని చెప్పారు. ఏజెంట్లు ఐడీ కార్డుతో పాటు ఆర్‌ఓ ఇచ్చిన డిక్లరేషన్ ఫామ్ తప్పనిసరిగా తీసుకుని రావాలన్నారు. మంగళవారం ఉదయం 6.30 గంటల లోపే ఏజెంట్లు, అభ్యర్థులు, కౌంటింగ్ కేంద్రాలకు చేరుకోవాలని, ఏడు గంటల తర్వాత గేటు మూసివేస్తామని స్పష్టం చేశారు. కౌంటింగ్ కేంద్రంలో ఆర్‌ఓ సూచనలను ఉల్లంఘించి, కౌంటింగ్ ప్రక్రియకు కలిగించేలా వారిని బయటకు పంపిస్తామని చెప్పారు. కౌంటింగ్‌కు సుమారు 2 వేల మంది ఏజెంట్లు హాజరు కానున్నారని కలెక్టర్ నివాస్ తెలిపారు. కార్యక్రమంలో ఆయా నియోజకవర్గాల ఆర్‌ఓలు, ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.



కౌంటింగ్ సిబ్బందితో సమావేశంలో మాట్లాడుతున్న జేసీ, పిఠాపురం ఆర్ఓ ఎస్.రామ్‌సుందర్‌రెడ్డి

లోక్‌సభ స్థానం	1 (కాకినాడ)
పోటీ చేసిన అభ్యర్థులు	15
అసెంబ్లీ నియోజకవర్గాలు	7
అభ్యర్థులు	93
కాకినాడ సిటీ	15
కాకినాడ రూరల్	15
ప్రత్తిపాడు	15
జగ్గంపేట	14
పిఠాపురం	13
తుని	11
పెద్దాపురం	10
జిల్లాలో మొత్తం ఓటర్లు	16,34,122
పురుషులు	8,04,445
మహిళలు	8,29371
ఇతరులు	186
పోలైన ఓట్లు	13,12,255
పురుషులు	6,52,578 (81.12 శాతం)
మహిళలు	6,59,575 (79.52 శాతం)
ఇతరులు	102 (54.84 శాతం)
మొత్తం పోలింగ్ శాతం	80.30

జేఎన్‌టీయూకేలో ఏ నియోజకవర్గం ఓట్ల లెక్కింపు ఎక్కడంటే..

ప్రత్తిపాడు: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సెంట్రల్ లైబ్రరీ తూర్పు వైపు మూడో అంతస్తు.

పిఠాపురం: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సెంట్రల్ లైబ్రరీ పశ్చిమం వైపు మొదటి అంతస్తు.

జగ్గంపేట: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సెంట్రల్ లైబ్రరీ తూర్పు వైపు రెండో అంతస్తు.

కాకినాడ సిటీ: సివిల్ ఇంజినీరింగ్ పీజీ బ్లాక్ మొదటి అంతస్తు ఎడమ వైపు 4వ గది.

తుని: సివిల్ ఇంజినీరింగ్ పీజీ బ్లాక్ రెండో అంతస్తు ఉత్తరం వైపు ఒకటో నంబర్ గది.

కాకినాడ రూరల్: మెకానికల్ ఇంజినీరింగ్ పీజీ బ్లాక్ రెండో అంతస్తు కుడి వైపు.

పెద్దాపురం: మల్టీపర్పస్ ఇండోర్ స్టేడియం గ్రౌండ్ ఫ్లోర్ ఉత్తరం వైపు.

సర్వం సిద్ధం

- ఓట్ల లెక్కింపునకు విస్తృత ఏర్పాట్లు
- 4 భవనాలు.. 9 హాళ్లు.. 196 టేబుళ్లు
- 941 మంది సిబ్బంది నియామకం

కాకినాడ సిటీ: సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపు ప్రక్రియకు విస్తృత ఏర్పాట్లు చేశారు. జిల్లాలోని కాకినాడ లోక్‌సభ, ఏడు అసెంబ్లీ స్థానాలకు మంగళవారం ఓట్ల లెక్కింపు జరగనుంది. దీనికోసం కాకినాడ జేఎన్‌టీయూలోని నాలుగు భవనాల్లో అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. లోక్‌సభ స్థానానికి 14, ఒక్కో అసెంబ్లీ స్థానానికి 14 చొప్పున టేబుళ్లు ఏర్పాటు చేశారు. వీటితో పాటు పోస్టల్ బ్యాలెట్ల లెక్కింపునకు ప్రత్యేక టేబుళ్లు వేశారు. మొత్తం అన్నీ కలిపి 196 టేబుళ్లు ఏర్పాటు చేశారు. ఒక్కో టేబుల్ వద్ద సూపర్‌వైజర్, సహాయ సూపర్‌వైజర్‌తో పాటు మరొకరిని నియమిస్తారు. ఈవిధంగా మొత్తం 196 టేబుళ్లకు 941 మంది సిబ్బందితో పాటు మరి కొంత మందిని రిజర్వులో ఉంచారు. కేంద్ర ప్రభుత్వ, ప్రభుత్వ రంగ సంస్థలకు చెందిన 196 మంది ఉద్యోగులను సూక్ష్మపరిశీలకులుగా నియమించారు.

లెక్కింపు చేపడతారిలా..

ఆయా నియోజకవర్గాల ఈవీఎంలు భద్రపరచిన స్ట్రాంగ్ రూములను ఉదయం 7.30 గంటలకు తెరుస్తారు. పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపుతో ఉదయం 8 గంటలకు కౌంటింగ్ ప్రక్రియ ప్రారంభమవుతుంది. ఈవీఎం ఓట్ల లెక్కింపు 8.30 గంటలకు ప్రారంభిస్తారు. రౌండ్ల వారీగా అభ్యర్థులకు పోలైన ఓట్ల వివరాలను ఆయా పార్టీల ఏజెంట్లకు అందజేస్తారు. అలాగే, మీడియా కేంద్రానికి కూడా అందిస్తారు.

40 వీవీ ప్యాట్ల లెక్కింపు

ఈసారి ఈవీఎం ఓట్లతో పాటు వీవీ ప్యాట్లలోని స్లిప్పులు కూడా లెక్కిస్తారు. ఒక్కో నియోజకవర్గంలో ఐదు పోలింగ్ కేంద్రాల వీవీ ప్యాట్లను లాటరీ పద్ధతిలో ఎంపిక చేసి, వాటిలోని స్లిప్పులు లెక్కిస్తారు. ఈవిధంగా పార్లమెంటరీ నియోజకవర్గానికి ఐదు, ఏడు అసెంబ్లీ స్థానాలకు 35 కలిపి మొత్తం 40 వీవీ ప్యాట్ల స్లిప్పులు తీసి లెక్కిస్తారు. వాటిని కూడా ఒకదాని తర్వాత ఒకటి మాత్రమే లెక్కిస్తారు. వీవీ ప్యాట్ల సిప్పుల లెక్కింపు పూర్తయిన తర్వాతే తుది ఫలితాలు వెల్లడిస్తారు.

రీ కౌంటింగ్ ఇలా..

పోస్టల్ బ్యాలెట్లు, ఎలక్ట్రానికల్లీ ట్రాన్స్‌మిటెడ్ పోస్టల్ బ్యాలెట్ సిస్టమ్ (ఈటీపీబీఎస్ - సర్వీసు ఓట్లు), ఈవీఎం ఓట్ల లెక్కింపు పూర్తయిన తరువాత ఆ ఫలితాలను సంబంధిత రిటర్నింగ్ అధికారి ఫామ్-20లో నమోదు చేస్తారు. ఏ అభ్యర్థికి ఎన్ని ఓట్లు వచ్చాయన్న వివరాలు ఇందులో ఉంటాయి. ఫలితాలను ఆర్‌ఓ వెల్లడించిన తరువాత రెండు నిమిషాల సమయం కేటాయిస్తారు. అభ్యర్థులు, ఎన్నికల, కౌంటింగ్ ఏజెంట్లలో ఎవరికైనా అభ్యంతరాలుంటే రీ కౌంటింగ్ జరపాలని రాత పూర్వకంగా ఆర్‌ఓను కోరవచ్చు. ఆ అభ్యర్థన సహేతుకంగా ఉందని నిర్ధారిస్తే రీకౌంటింగ్‌కు ఆర్‌ఓ ఆదేశించవచ్చు. సరైన కారణాలు లేవని గుర్తిస్తే తిరస్కరించవచ్చు. తన నిర్ణయాన్ని ఆర్‌ఓ రాత పూర్వకంగా తెలియజేయాలి. ఒకవేళ రీ కౌంటింగ్ జరిగిన తర్వాత ఓట్లలో ఏమైనా వ్యత్యాసాలుంటే ఆ మేరకు రిజల్ట్ షీట్‌లో సవరణలు చేయాలి. గెలుపొందిన అభ్యర్థికి రిటర్నింగ్ అధికారి సర్టిఫికెట్ ఇస్తారు. ఆ వెంటనే ఫలితాలను హౌస్ ఆఫ్ పార్లమెంట్, అసెంబ్లీ సెక్రటరీకి పంపుతారు. ఆ మేరకు సెక్రటరీ గెజిట్ పబ్లికేషన్ చేస్తారు.

పటిష్ట భద్రత

కౌంటింగ్ కేంద్రాల వద్ద పోలీస్, ఏపీఎస్పీ, స్పెషల్ పార్టీ, సెంట్రల్ పార్టీ, హోంగార్డులతో కలిపి నాలు గంచెల భద్రత ఏర్పాటు చేశారు. దీనికోసం మొత్తం 1,400 మంది సిబ్బందిని నియమించారు. వీరు కాకుండా కౌంటింగ్ కేంద్రాల వద్ద బందోబస్తుకు 500 మంది పోలీసు సిబ్బందిని కూడా నియమించారు. ప్రతి లెక్కింపు కేంద్రం వద్ద సీసీ కెమెరాలు అమర్చారు. లెక్కింపు ప్రక్రియ మొత్తం చిత్రీకరించి, సీడీ రూపంలో భద్రపరుస్తారు. గుర్తింపు కార్డు ఉంటేనే కౌంటింగ్ కేంద్రంలోకి అనుమతిస్తారు. భద్రతా సిబ్బంది తోడుగా ఉండే నాయకులెవ్వరికీ లెక్కింపు కేంద్రంలోకి ప్రవేశం లేదు. ఒకవేళ వారు అభ్యర్థులైతే భద్రతా సిబ్బందిని బయట వదిలి లోపలకు వెళ్లడానికి అనుమతిస్తారు. మంగళవారం అర్ధరాత్రి వరకూ మద్యం విక్రయాలను నిషేధించారు. సెల్‌ఫోన్లు, అగ్గిపెట్టెలు, లైటర్లు వంటి వస్తువులను హాల్లోకి తీసుకెళ్లడానికి అనుమతి లేదు. కౌంటింగ్ కేంద్రాలతో పాటు జిల్లావ్యాప్తంగా 144 సెక్షన్, పోలీస్ యాక్ట్ 30 అమలు చేస్తున్నారు. వీటి ప్రకారం ఎక్కడా ముగ్గురికి మించి ప్రజలు గుంపులుగా తిరగరాదు. పోలీసుల ముందస్తు అనుమతి లేకుండా ఎక్కడా సభలు, సమావేశాలు, ర్యాలీలు నిర్వహించరాదు.

పర్యవేక్షణకు పరిశీలకులు

ఓట్ల లెక్కింపున ప్రక్రియను నేరుగా పర్యవేక్షించేందుకు కేంద్ర ఎన్నికల సంఘం ఏడుగురు పరిశీలకులను నియమించింది. వీరు ఈ నెల 5వ తేదీ వరకూ జిల్లాలోనే ఉండి లెక్కింపు ప్రక్రియను నిశితంగా పర్యవేక్షిస్తారు. తుని నియోజకవర్గానికి గౌరవ్ కుమార్, ప్రత్తిపాడుకు రాజేష్ జోగ్‌పాల్, పిఠాపురానికి డాక్టర్ మేజర్ విశాల్ శర్మ, కాకినాడ రూరల్ నిధి సరోహి, పెద్దాపురం ఆల్బర్ట్ బిలుంగ్, కాకినాడ సిటీకి ఎస్.గణేష్, జగ్గంపేటకు డాక్టర్ కె.ద్రాక్షాయనిని పరిశీలకులుగా నయిమించారు. వీరితో పాటు రిటర్నింగ్ అధికారి (ఆర్‌ఓ), సహాయ ఆర్‌ఓలు కూడా లెక్కింపును పర్యవేక్షిస్తారు.



కౌంటింగ్ కేంద్రంలో పూర్తయిన ఏర్పాట్లు

కౌంటింగ్ వేళ.. రూటు ఇలా..

- నగరంలో ట్రాఫిక్ మళ్లింపు
- రూట్ మ్యాప్ వెల్లడించిన డీఎస్పీ

కాకినాడ క్రైం: సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపు నేపథ్యంలో మంగళవారం కాకినాడ నగరంలో ట్రాఫిక్ మళ్లిస్తున్నారు. దీనికి సంబంధించిన రూట్ మ్యాప్‌ను డీఎస్పీ కె.హనుమంతరావు తన కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వెల్లడించారు. ఆ వివరాలివీ..

పిఠాపురం నుంచి..

- పిఠాపురం నుంచి చిత్రాడ మీదుగా తిమ్మాపురం వై-జంక్షన్ వద్ద కుడివైపు మళ్లి కొత్తగా వేసిన బైపాస్ మార్గంలో ఏడీబీ రోడ్డుకు చేరుకోవాలి. కొప్పవరం జంక్షన్ నుంచి కుడివైపు మళ్లి ఉండూరు వంతెన మీదుగా సామర్లకోట వెళ్లే వారు కుడివైపు, ఇంద్రపాలెం వైపు వెళ్లే వారు ఎడమవైపు మళ్లాలి.
- కాకినాడ నగరంలోకి వెళ్లే వారు ఉండూరు వంతెన మీదుగా ఎడమవైపు మళ్లి, కెనాల్ రోడ్డు మీదుగా మాధవపట్నం, ప్రతాప్ నగర్ వంతెన, ఇంద్రపాలెం వంతెన గుండా గమ్యానికి చేరాలి.
- పెదపూడి వెళ్లే వారు ఇదే మార్గంలో ఇంద్రపాలెం వంతెనకు చేరుకొని కుడివైపు తిరిగి, చీడిగ కొత్త బైపాస్ మీదుగా వెళ్లాలి.
- రామచంద్రపురం, ద్రాక్షారామ వైపు వెళ్లే వారు చీడిగలో కొత్తగా నిర్మాణంలో ఉన్న వంతెన ఎడమవైపు బైపాస్‌కు వెళ్లి, అక్కడి నుంచి తూరంగి బ్రిడ్జి కుడి వైపు నుంచి వెళ్లి రామచంద్రపురం, ద్రాక్షారామ వైపు ప్రయాణించాలి.
- యానాం, అమలాపురం వైపు వెళ్లే వారు కూడా పై మార్గంలోనే తూరంగి వంతెనకు చేరుకొని అక్కడి నుంచి ఉప్పలంక వై-జంక్షన్ మీదుగా వెళ్లాలి.

అమలాపురం నుంచి..

- అమలాపురం, యానాం మీదుగా వచ్చే వారు ఉప్పలంక వై-జంక్షన్ వద్ద ఎడమవైపు మళ్లి తూరంగి వంతెన నుంచి చీడిగ వంతెన వద్దకు చేరి, కుడివైపు తిరిగి ఇంద్రపాలెం వంతెన మీదుగా ఎడమవైపు తీసుకొని కెనాల్ రోడ్డు మీదుగా సామర్లకోట వైపు వెళ్లవచ్చు. ఇంద్రపాలెం వంతెన వద్ద కుడి వైపు మళ్లి కాకినాడ నగరంలోకి చేరవచ్చు.
- పిఠాపురం వెళ్లాల్సిన వారు సామర్లకోట మీదుగా లేదా కెనాల్ రోడ్డులోని ఉండూరు వంతెన వద్దకు చేరుకొని అక్కడి నుంచి కుడివైపు మళ్లాలి. ఏడీబీ రోడ్డులోని కొప్పవరం జంక్షన్ వద్ద కొత్తగా నిర్మాణంలో ఉన్న ఎన్‌హెచ్-216 వంతెన వద్ద ఎడమవైపు తీసుకొని తిమ్మాపురం వై-జంక్షన్ నుంచి పిఠాపురం మార్గానికి చేరుకోవాలి.

కాకినాడ నుంచి..

- భానుగుడి సెంటర్ నుంచి ముత్తా గోపాలకృష్ణ వారధి మీదుగా శారదా దేవి గుడి, కరణంగారి జంక్షన్ నుంచి కుడివైపు తీసుకొని ఎస్వీ రంగారావు విగ్రహం, గైగోలుపాడు జంక్షన్, సర్పవరం పూల మార్కెట్ మీదుగా మాధవపట్నం సెంటర్, కెనాల్ రోడ్డు మీదుగా సామర్లకోట చేరుకోవాలి.
- సర్పవరం పూల మార్కెట్ నుంచి పనసపాడు మీదుగా ఏడీబీ రోడ్డులోకి ప్రవేశించి కొప్పవరం జంక్షన్ వద్ద కొత్తగా నిర్మాణంలో ఉన్న వంతెన నుంచి కుడివైపు తిరిగి, తిమ్మాపురం వై-జంక్షన్ మీదుగా పిఠాపురం వైపు వెళ్లవచ్చు.

నగరంలోనూ వాహనాల మళ్లింపు

నగరంలోని వాహనదారులు జేఎన్‌టీయూకే పరిసర ప్రాంతాలకు రాకుండా చర్యలు చేపట్టారు. అచ్చంపేట జంక్షన్ నుంచి వచ్చే వారు సర్పవరం జంక్షన్, గంగరాజు నగర్, టి-జంక్షన్, ఆర్‌టీఓ ఆఫీస్ జంక్షన్, గొడారిగుంట అంబేడ్కర్ విగ్రహం, కోకిల సెంటర్, మదర్ థెరిసా విగ్రహం మీదుగా ప్రయాణించాలి. అలాగే, భానుగుడి జంక్షన్ నుంచి వెళ్లే వారు కరణంగారి జంక్షన్, ఎస్వీ రంగారావు జంక్షన్, గైగోలుపాడు జంక్షన్, సర్పవరం పూల మార్కెట్, మాధవపట్నం జంక్షన్ మీదుగా వెళ్లాలి.

ఈ ప్రాంతాల్లోకి నో ఎంట్రీ

ఓట్ల లెక్కింపు జరుగుతున్న జేఎన్‌టీయూకే క్యాంపస్, స్టేడియం చుట్టుపక్కల ప్రదేశాలైన ఆశ్రం పబ్లిక్ స్కూల్, నాగమల్లితోట జంక్షన్, వినాయక కేఫ్, అమ్మవారి టెంపుల్, డీఎస్‌ఏ స్పోర్ట్స్ గ్రౌండ్, ఆర్‌టీవో ఆఫీస్ జంక్షన్, కమ్మ కల్యాణ మండపం, రామ్‌కోసా జంక్షన్, మెన్స్ హాస్టల్ సెంటర్, ఫారెస్టు ఆఫీస్ రోడ్డు, ఏఆర్ లైన్స్, భానుగుడి జంక్షన్, పాత ఎస్పీ ఆఫీస్, ప్రభుత్వ ఐటీఐ, ఎగ్జిబిషన్ గ్రౌండ్‌తో పాటు క్యాంపస్, స్టేడియం చుట్టూ, మధ్యలో ఉన్న ప్రదేశాల్లోనికి ప్రవేశంపై నిషేధం విధించారు. ఆయా ప్రాంతాల్లోని ప్రజలు రామ్‌కోసా జంక్షన్ మార్గాన్ని మాత్రమే వినియోగించుకోవాలి.

భారీ వాహనాలు ఎక్కడివక్కడ..

- కౌంటింగ్ ప్రక్రియ పూర్తయ్యేంత వరకూ భారీ వాహనాలను ఎక్కడికక్కడే నిలుపు చేస్తారు.
- రాజానగరం - సామర్లకోట ఏడీబీ రోడ్డులో వస్తున్న లేదా వెళుతున్న భారీ వాహనాలను అక్కడే నిలిపివేయాలి.
- కత్తిపూడి వంతెన నుంచి కాకినాడ పోర్టుకు చేరుకునే భారీ వాహనాలను కత్తిపూడి జంక్షన్ వద్ద ఎన్‌హెచ్-16 వద్ద నిలపాలి.
- ఉప్పాడ బీచ్ రోడ్డు మీదుగా వచ్చే భారీ వాహనాలను సూర్యారావుపేట జంక్షన్ వద్ద, యానాం నుంచి కాకినాడ పోర్టు వైపు వెళ్లే భారీ వాహనాలు ఉప్పలంక వై-జంక్షన్ వద్ద జాతీయ రహదారిపై నిలిపివేయాలి.
- ఉప్పాడ నుంచి కాకినాడ వచ్చే వాహనాలను ఉప్పాడ గ్రామం వద్ద నిలపాలి.

పార్కింగ్ ఇలా..

- ఓట్ల లెక్కింపునకు హాజరయ్యే అభ్యర్థులు, వారి ఏజెంట్లు, సిబ్బంది వాహనాలకు పోలీసు శాఖ ప్రత్యేక పార్కింగ్ ఏర్పాటు చేసింది.
- కాకినాడ సిటీ, కాకినాడ రూరల్, జగ్గంపేట, ప్రత్తిపాడు, పిఠాపురం, తుని నియోజకవర్గాలకు చెందిన వారు తమ వాహనాలను జేఎన్‌టీయూకే ఎదురుగా ఉన్న ఎగ్జిబిషన్ గ్రౌండ్, ఐటీఐ గ్రౌండ్‌లో నిలపాలి.
- పెద్దాపురం నియోజకవర్గ కౌంటింగ్‌కు హాజరయ్యే అభ్యర్థులు, వారి ఏజెంట్లు, సిబ్బంది వాహనాల పార్కింగ్‌కు జిల్లా స్పోర్ట్స్ అథారిటీ గ్రౌండ్ కేటాయించారు.



ట్రాఫిక్ మళ్లింపు వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీహనుమంతరావు

క్లుప్తంగా

బాలిక అదృశ్యం

కడియం: మండల కేంద్రమైన **కడియంలోని** భాస్కర్‌రామ్ నగర్‌కు చెందిన **సుంకర వర్షిత** అనే 16 సంవత్సరాల బాలిక **అదృశ్యమైంది.** బాలిక తల్లి ఇచ్చిన ఫిర్యాదు **మేరకు కడియం** పోలీస్‌లు కేసు నమోదు **చేసి దర్యాప్తు** చేస్తున్నారు. తల్లిదండ్రులు **మందలించడంతో** ఇంటి నుంచి ఒకటో తేదీ మధ్యాహ్నం 12.30 సమయానికి వెళ్లిపోయింది. వెతికినప్పటికీ ఆమె ఆచూకీ లభ్యం కాకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఎస్‌ఐ బి. నాగదుర్గా ప్రసాదు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

11న ఏపీ మోడల్ స్కూల్ ప్రవేశ పరీక్ష

తుని రూరల్: ఏపీ మోడల్ స్కూల్ హంసవరంలో 2024–25 విద్యా సంవత్సరానికి మిగిలి ఉన్న ఏడు, ఎనిమిది, తొమ్మిది తరగతుల్లో ఖాళీల భర్తీకి ఈ నెల 11న ప్రవేశ పరీక్ష నిర్వహిస్తున్నట్టు ఆ పాఠశాల ప్రిన్సిపాల్ పద్మజ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తిగల విద్యార్థులు పాఠశాలలో వివరాలు నమోదు చేసుకోవాలన్నారు.

సత్యదేవుని ఆలయానికి పోటెత్తిన భక్తులు

అన్నవరం: రత్నగిరి సత్యదేవుని ఆలయం సోమవారం వేలాదిగా తరలివచ్చిన భక్తులతో కిటకిటలాడింది. సుమారు 30 వేల మంది భక్తులు స్వామివారిని దర్శించి పూజలు చేశారు. తెల్లవారుజాము నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు స్వామివారి సన్నిధికి తరలివచ్చారు. సత్యదేవుడిని దర్శించిన అనంతరం భక్తులు సప్తగోకులంలో గోవులకు ప్రదక్షిణ చేశారు. స్వామివారి వ్రతాలు రెండు వేలు నిర్వహించారు. అన్ని విభాగాల ద్వారా దేవస్థానానికి రూ.30 లక్షల ఆదాయం సమకూరింది. నాలుగు వేల మంది సత్యదేవుని నిత్యాన్నదాన పథకంలో భోజనం చేశారు. సత్యదేవుడు, అనంతలక్ష్మీ సత్యవతీదేవి అమ్మవారు, ఈశ్వరుడిని ముత్యాల కవచం వస్త్రాలంకరణలో అలంకరించారు.

పర్యావరణ హితం.. కావాలి అభిమతం

- ప్రతి ఒక్కరూ భాగస్వాములవుదాం
- సుస్థిరాభివృద్ధి లక్ష్యాలు సాధిద్దాం
- 5 నుంచి పాఠశాలల్లో అవగాహన
- విద్యార్థి దశ నుంచే చైతన్యం



కాకినాడ సిటీ: దేశంలో అభివృద్ధి పెరిగే కొద్దీ పుడమి తల్లికి కష్టాలు తప్పడం లేదు. ఒకవైపు పెరుగుతున్న జనాభా, వారి విలాస భరిత జీవన పయనంలో క్రమశిక్షణ కోల్పోయి ఇష్టానుసారంగా ప్రకృతిని పాడు చేయడంతో నింగి, నేల, గాలి కలుషితమవుతున్నాయి. ఇందుకు నేడు భూతాపమే నిదర్శనం. ఆధునికత ఎక్కువ అయ్యే కొద్దీ మనుషుల మనుగడ ప్రశ్నార్థకంగా మారుతోంది. ఒకవైపు ప్లాస్టిక్ వ్యర్థాలు, మరోవైపు మందుల తయారీతో పాటు చెట్లను నరకడం, ఏసీల విపరీత వాడకంతో వాతావరణ కాలుష్యం రెట్టింపు అవుతోంది. వీటన్నింటి పరిణామాలతో భూతాపం రోజురోజుకు పెరిగి సకాలంలో వర్షాలు కురవడం లేదు. ఉన్నట్టుండి విపత్తులు చోటు చేసుకోవడంతో భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారుతోంది. ఈ నేపథ్యంలో ప్రతి ఒక్కరూ తమ పరిధి వరకు పుడమి తల్లిని కాపాడుకునేందుకు కృషి చేయాల్సిన అవసరం ఉంది. ఇందుకు సంబంధించి ప్రపంచ వ్యాప్త ఉద్యమం ఊపు అందుకుంది. ఏటా జూన్ 5వ తేదీ ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా పలు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఐక్యరాజ్యసమితి అనుబంధంగా ఇంటర్ ప్యానల్ ఇన్ క్లైమేట్ చేంజ్ (ఐపీసీసీ) పర్యావరణ పరిరక్షణకు నడుం బిగించి సుస్థిరాభివృద్ధి లక్ష్యాలను నిర్దేశించింది. అందులో భాగంగా పాఠశాల స్థాయి నుంచి విద్యార్థులను చైతన్యం చేసేందుకు పొల్యూషన్ బోర్డు, విద్యుత్, పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్, అటవీ, విద్యాశాఖల సంయుక్త ఆధ్వర్యంలో అన్ని ప్రభుత్వ, ప్రైవేటు విద్యా సంస్థల్లో ఈ నెల 5 నుంచి 19 వరకు పలు అవగాహన కార్యక్రమాలు నిర్వహించనుంది.

అన్ని పాఠశాలల్లో నిర్వహించాలి



పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని అన్ని పాఠశాలల్లో కార్యక్రమాలను నిర్వహించాలి. షెడ్యూల్ ప్రకారం ఆయా తేదీలలో ఆయా పాఠశాలల్లో కార్యక్రమాలను నిర్వహించాలి. ఈ విషయంలో ప్రధానోపాధ్యాయులతో పాటు ఉపాధ్యాయులు, ఆయా డిపార్టుమెంట్ అధికారులు సమన్వయంతో అన్ని కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించాలి. ఎవరూ నిర్లక్ష్యంగా వ్యవహరించవద్దు.

– పిల్లి రమేష్, జిల్లా విద్యాశాఖాధికారి

విజయవంతం చేయాలి



పర్యావరణ చైతన్య కార్యక్రమాలను విజయవంతం చేయాలి. నీటి వృథాను అరికట్టడం, మొక్కలను నాటడం, విద్యుత్తు ఆదా, వ్యర్థాలను పునర్వినియోగించడం వంటి కార్యక్రమాలలో అన్ని డిపార్టుమెంట్‌లతో పాటు, స్వచ్ఛంద సంస్థలు, పర్యావరణ అవగాహన కార్యక్రమాల్లో పాల్గొని విజయవంతం చేయాలి.

– చామంతి నాగేశ్వరరావు, కమ్యూనిటీ మొబలైజేషన్ ఆఫీసర్, కాకినాడ జిల్లా సమగ్ర శిక్ష

షెడ్యూల్ ఇలా..

5వ తేదీ

ప్లాస్టిక్‌ను ఉపయోగించకూడదని చెప్పే కార్యక్రమాలను పాఠశాలల్లో నిర్వహించడం, పర్యావరణ అనుకూల వస్తువులను వాడటం, ప్లాస్టిక్ వస్తువుల సంఖ్య నోట్ చేయడం, ప్లాస్టిక్ వాడకానికి వ్యతిరేకంగా పోస్టర్లు, జనపనార వస్తువుల వాడకం, పర్యావరణ అనుకూల అలవాట్లు పెంపొందించడం వంటి కార్యక్రమాలపై అవగాహన చేపడతారు.

12న నీటి ఆదాపై..

ఆర్‌డబ్ల్యూఎస్ అధికారుల ఆధ్వర్యంలో పాఠశాలల్లో నీటి లీకేజీని అరికట్టడం, పైపుల లీకేజీని తనిఖీ చేయడం, నీటి స్వచ్ఛత పరీక్షల నిర్వహణ, నీటి సంరక్షణ ర్యాలీ, వర్షపు నీటి నిల్వ వ్యవస్థలపై అవగాహన కార్యక్రమాలను నిర్వహించాలి.

13న శక్తిని ఆదా చేయడం

విద్యుత్‌శాఖ ఆధ్వర్యంలో ఎనర్జీ సేవింగ్ యాక్టివిటీస్, ఎనర్జీ టీమ్, ఎకో క్లబ్ ఎనర్జీ టీమ్‌తో డ్యూటీ రోస్టర్, నాలెడ్జ్ బిల్డింగ్ సెషన్లు, పోస్టర్లు, బ్యానర్లు, ఇతర విజువల్ మెటీరియల్ క్రియేట్ చేయడం, డిస్‌ప్లే బోర్డులు పోస్టు చేయడం వంటి కార్యక్రమాలు చేపడతారు.

14న శుభ్రత కాపాడటం

పంచాయతీరాజ్‌శాఖ ఆధ్వర్యంలో శుభ్రత, వ్యర్థాలను వేరు చేయడం, తరగతి గదుల్లో రెండు డస్ట్‌బిన్‌ల ఏర్పాటు, శానిటరీ వ్యర్థాలు, కంపోస్ట్ పిట్లు, వస్త్రాలు, బొమ్మలు వంటి వివరాల డ్రైవ్‌ను నిర్వహించడం, కమ్యూనిటీ సభ్యులతో ఇంటరాక్టివ్ సెషన్లు నిర్వహించడం (సేంద్రియ వ్యర్థాలను వేరు చేయడం) వంటి కార్యక్రమాలను చేపడతారు.

15న వ్యర్థాలను తగ్గించడం

పారిశుధ్య శాఖ ఆధ్వర్యంలో వ్యర్థాలను సేకరించడం, భూమిపై ఈ వ్యర్థాల ప్రభావంపై పిల్లలతో చర్చించడం వంటి కార్యక్రమాల నిర్వహణ

18న స్థిరమైన ఆహార వ్యవస్థపై..

కిచెన్ గార్డెన్‌లను అభివృద్ధి చేయడం, ప్లాస్టిక్ సీసాలు మొదలైన అందుబాటులో ఉన్న పదార్థాలను ఉపయోగించడం, వ్యర్థాలతో పర్యావరణ అనుకూల ఎరువులు, మొక్కల పెరుగుదల, ఉత్పత్తి రికార్డు నిర్వహించడం, పర్యావరణ ప్రయోజనాల గురించి చర్చించడం వంటి కార్యక్రమాలను చేపట్టడం.

19న ఆరోగ్యకర జీవనశైలిని అడాప్ట్ చేయడం

నేచర్ నాక్, ప్లాంటేషన్ డ్రైవ్, పర్యావరణ శాస్త్రం, చరిత్ర భౌగోళిక ఆచారాలు, సంప్రదాయాలను పరిశీలించడానికి సమీప గ్రామాల సందర్శనలు వంటి కార్యక్రమాలను నిర్వహించాలి.

క్రికెట్ టోర్నీ విజేత చింతలపూడి

రన్నర్‌గా యాదవోలు జట్టు



చింతలపూడి జట్టుకు ట్రోఫీ అందజేస్తున్న నిర్వాహకులు

దేవరపల్లి: మండలంలోని యర్నగూడెంలో నిర్వహించిన పోతుల కాంతారావు స్మారక జిల్లాస్థాయి క్రికెట్ టోర్నమెంట్‌లో ఏలూరు జిల్లా చింతలపూడి జట్టు విజేతగా నిలిచింది. గత 29 రోజులుగా జరుగుతున్న పోటీల్లో 40 జట్లు పాల్గొని తమ ప్రతిభను చూపాయి. సోమవారం జరిగిన ఫైనల్‌లో చింతలపూడి, దేవరపల్లి మండలం యాదవోలు జట్ల మధ్య హోరాహోరీగా పోటీ జరిగింది. పోటీలో చితలపూడి జట్టు విజయం సాధించి ట్రోఫీ కైవసం చేసుకోగా, యాదవోలు జట్టు ద్వితీయ స్థానం సాధించింది. మొదటి బహుమతిగా మాజీ సర్పంచ్ పోతుల బాబూరావు రూ.55 వేలు, ద్వితీయ బహుమతిగా సర్పంచ్ బొంతా భరత్‌బాబు రూ.33 వేలు విజేతలకు అందజేశారు. బహుమతుల ప్రదానోత్సవ కార్యక్రమంలో బొల్లిన భాస్కర్, గద్దే శ్రీనివాస్, బొల్లిన రమేష్,బాబు, కోడూరి బద్రి, నల్లం మనోహర్, బెల్లపు చిరంజీవి పాల్గొన్నారు.

హత్య కేసులో ఇద్దరి అరెస్టు

ప్రత్తిపాడు: వ్యక్తిని హత్య చేసి, గుట్టుచప్పుడు కాకుండా మృతదేహాన్ని పూడ్చిపెట్టిన కేసులో ప్రత్తిపాడు పోలీసులు ఇద్దరు నిందితులను అరెస్టు చేశారు. ప్రత్తిపాడు మండలం ఒమ్మంగి గ్రామానికి చెందిన మొగిలి సతీష్‌ను దారుణంగా హత్య చేసిన ఘటన తెలిసిందే. ఈ కేసులో ఇద్దరు నిందితులను అరెస్టు చేయగా, మరో నిందితుడు పరారీలో ఉన్నాడు. ఈ ఘటన వివరాలను స్థానిక పోలీస్ స్టేషన్ ఆవరణలో సోమవారం ప్రత్తిపాడు సీఐ ఎం.శేఖర్‌బాబు విలేకరులకు వివరించారు. ఆయన కథనం మేరకు కిర్లంపూడి మండలం సింహాద్రిపురం గ్రామానికి చెందిన మొగిలి సతీష్‌తో ప్రత్తిపాడు మండలం ఒమ్మంగి గ్రామానికి చెందిన విజయకుమారికి పదేళ్ల క్రితం వివాహమైంది. అనంతరం సతీష్ తన భార్యతో కలిసి ఒమ్మంగిలో నివాసం ఉంటున్నాడు. గత నెల 6వ తేదీన తన భర్త సతీష్ కనిపించడం లేదని అతని భార్య విజయకుమారి పోలీసులకు ఫిర్యాదు చేసింది. గత నెల 9వ తేదీన శంఖవరం మండలం పెదమల్లాపురం గ్రామ సమీపంలో సతీష్ బైక్ దగ్ధమైనట్టు కనుగొన్నారు. అదృశ్యమైన కేసుగా గుర్తించి పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ఇదిలా ఉండగా ఫిర్యాదు చేసిన మొగిలి విజయలక్ష్మి మేనత్త కుమారుడు ఒమ్మంగి గ్రామానికి చెందిన బుర్రా దొరబాబు ఈ నెల ఒకటో తేదీ సాయంత్రం స్థానిక డిప్యూటీ తహసీల్దార్ కె.పుణ్యవతి సమక్షంలో లొంగిపోయాడు. వ్యక్తిగత కక్షలతో బుర్రా దొరబాబు, అదే గ్రామానికి చెందిన గాడిదల లోవరాజు..సతీష్‌ను ధర్మవరం గ్రామ శివారు పోలవరం గట్టుకు రప్పించి, ఇనుపరాడ్డుతో కొట్టి హత్య చేశారు. సెల్‌ఫోన్‌ను పగులకొట్టి, కాల్చివేశారు. లోవరాజు సహాయంతో సతీష్ మృతదేహాన్ని ట్రాక్టర్‌పై కొంతదూరం తీసుకువచ్చిన తర్వాత లోవరాజు వెళ్లిపోయాడు.

దొరబాబు తన మామగారైన వాయిలశెట్టి విశ్వనాథం సహాయంతో మండలంలోని పాదురుపాక సమీపంలోని సర్వే తోటలో గొయ్యి తీసి, సతీష్ మృతదేహాన్ని పాతి పెట్టాడు. సతీష్ మోటారు సైకిల్‌ను గత నెల 9వ తేదీ రాత్రి శంఖవరం మండలం పెదమల్లాపురం శివారులో పెట్రోల్ పోసి, దగ్ధం చేశాడు. అప్పటి నుంచీ తప్పించుకు తిరుగుతున్నా పోలీసు భయం వెంటాడడంతో బుర్రా దొరబాబు లొంగిపోయాడు. మృతదేహాన్ని వెలికితీసి, రెవెన్యూ అధికారుల సమక్షంలో శవ పంచనామా నిర్వహించారు. హత్యకు ఉపయోగించిన ఇనుపరాడ్డును, తగులబెట్టిన బైక్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో ఈ నెల 2వ తేదీ రాత్రి బుర్రా దొరబాబును, రాచపల్లి గ్రామంలో సోమవారం గాడిదల లోవరాజు అనే పాట్టోడును అరెస్టు చేశారు. నిందితులిద్దరినీ స్థానిక కోర్టులో హాజరుపర్చగా న్యాయమూర్తి రిమాండ్‌కు ఆదేశించారు. ఈ కేసులో మరో ముద్దాయి వాయిలశెట్టి విశ్వనాథం పరారీలో ఉన్నాడని ప్రత్తిపాడు సీఐ ఎం.శేఖర్‌బాబు తెలిపారు. ఈ సమావేశంలో స్థానిక ఎస్సై ఎం.పవన్‌కుమార్ పాల్గొన్నారు.

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

పిఠాపురంపై ప్రత్యేక నిఘా

సెబ్ ఐజీ రవిప్రకాష్



పిఠాపురం: అత్యంత సమస్యాత్మక నియోజకవర్గాలుగా ఉన్న పిఠాపురం, కాకినాడ, రాజానగరంలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసినట్టు సెబ్ ఐజీ ఎం.రవిప్రకాష్ తెలిపారు. ఆయన సోమవారం రాత్రి పిఠాపురంలో విలేకర్లతో మాట్లాడారు. సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ నేపథ్యంలో ప్రశాంతతకు భంగం కలిగిస్తే ఉపేక్షించేది లేదని ఆయన హెచ్చరించారు. కౌంటింగ్ సందర్భంగా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఏలూరు రేంజ్ పరిధిలో ఉన్న అన్ని జిల్లాల్లో పోలీసు శాఖ కట్టుదిట్టమైన బందోబస్తు ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. అత్యంత సమస్యాత్మక నియోజకవర్గాలైన పిఠాపురం, కాకినాడ, రాజానగరం నియోజకవర్గాల్లో కేంద్ర బలగాలతో ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. ఎవరూ రెచ్చగొట్టే పోస్టింగులు, ప్రసంగాలు సోషల్ మీడియాలో పోస్టు చేయరాదని, అలా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గెలుపు ఓటములు సహజమని వీటిపై పౌరుషాలకు పోకుండా అందనూ సమన్వయం పాటించాలని సూచించారు. కక్ష సాధింపు చర్యలకు, కవ్వింపు చర్యలకు ఎవరూ పాల్పడరాదన్నారు. ఈ నెల ఆరో తేదీ వరకు మోడల్ కోడ్ ఆఫ్ కాండక్టు, సెక్షన్ 144, పోలీసు యాక్టు 30 అమలులో ఉంటాయని, వాటిని ఎవరైనా అతిక్రమిస్తే చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఎన్నికల సమయంలో ఎన్నికల కోడ్ అమలులో ఉండగా కేసుల్లో ఇరుక్కుంటే జీవితాంతం బాధపడాల్సి వస్తుందని, దీనిని గమనించి అందరూ శాంతి భద్రతలకు భంగం కలగకుండా వ్యవహరించాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో కాకినాడ జిల్లా ఎస్పీ కె.సతీష్‌కుమార్, ఏసీబీ ఎస్పీ కె.రామ్‌మోహన్, డీఎస్పీ హనుమంతరావు, ట్రైనీ డీఎస్పీ ప్రమోద్, సీఐ శ్రీనివాస్ పాల్గొన్నారు.

ప్రతి ఫామ్‌కూ ఓ లెక్కుంది

రాజమహేంద్రవరం రూరల్: సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపు ప్రక్రియలో అధికార యంత్రాంగం అనేక ఫామ్‌లు వినియోగిస్తుంది. వీటిల్లో ప్రతి ఫామ్‌కూ ఒక ప్రాధాన్యం ఉంది. అసెంబ్లీ, పార్లమెంటు నియోజకవర్గాల ఓట్ల లెక్కింపు ఒకేసారి చేపడతారు. ఫలితాల బటన్ నొక్కగానే ప్రతి అభ్యర్థికీ పోలైన ఓట్లు ఈవీఎంలో కనిపిస్తాయి. ప్రతి రౌండ్ లెక్కింపునకు ముందు కౌంటింగ్ ఏజెంట్లతో 17–సీ ఫామ్‌లో తప్పనిసరిగా సంతకాలు తీసుకుంటారు. రౌండ్ల వారీగా ఫలితాలను ఫామ్–20లో నమోదు చేసి కంట్రోల్ రూమ్, సువిధ యాప్‌లో నమోదు చేసిన తరువాత మాత్రమే రౌండ్ల వారీ ఫలితాన్ని అధికారికంగా ప్రకటిస్తారు.

కీలకఫామ్‌లు ఇవీ...

- **ఫామ్18:** (కౌంటింగ్ ఏజెంట్ నియామక పత్రం): ఎన్నికల రిటర్నింగ్ అధికారి(ఆర్‌ఓ) జారీ చేసిన ఈ ధ్రువపత్రం ఉంటేనే అభ్యర్థుల ఏజెంట్లను కౌంటింగ్ కేంద్రం లోపలకు అనుమతిస్తారు.
- **ఎనగ్జర్ 38:** ఓట్ల లెక్కింపునకు నియమితులైన పర్యవేక్షకులు, సహాయకులకు జారీ చేసే ధ్రువీకరణ పత్రం
- **ఎనగ్జర్‘ఎ’:** ఎంపిక చేసిన ఐదు వీవీ ప్యాట్ల వివరాలు ఉంటాయి
- **ఎనగ్జర్‘బి’:** వీవీ ప్యాట్లలోని స్లిప్పుల లెక్కింపు తరువాత ఏ అభ్యర్థికి ఎన్ని ఓట్లు వచ్చాయో ఎన్నికల పరిశీలకుడు ధ్రువీకరించే పత్రం
- **ఫామ్ 21సీ:** ఓట్ల లెక్కింపు అనంతరం వెంటనే ఫలితాలు దీనిలో నమోదు చేస్తారు.
- **ఫామ్ 22:** విజయం సాధించిన అభ్యర్థికి ఎన్నికల అధికారి జారీచేసే ధ్రువపత్రం. దీని ద్వారానే చట్టసభల్లో సభ్యులుగా ప్రవేశిస్తారు.
- **ఎనగ్జర్58:** పార్ట్1లో పోలింగ్ బూత్‌ల వారీగా మొత్తం ఓట్లు, పోలైన ఓట్ల వివరాలుంటాయి. పార్ట్ 2లో పోలింగ్ కేంద్రాల వారీగా ఓట్ల లెక్కింపు, ఆధిక్యాలు, ఫలితాలు వివరాలుంటాయి.
- **ఎనగ్జర్ 39:** దీనిలో తుది ఫలితం వివరాలు సమగ్రంగా ఉంటాయి. పోలింగ్ కేంద్రాల వారీగా ఓట్ల ఆధిక్యతలు నోటాతో సహా పొందుపరుస్తారు. ఆర్‌ఓ సంతకం చేసిన తరువాత దీనిని అధికారికంగా విడుదల చేస్తారు.

పిచ్చి కుక్క స్వైర విహారం

- ఆరుగురికి గాయాలు
- ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స

నిడదవోలు : పట్టణంలోని గాంధీనగర్ మూడో వీధిలో పిచ్చి కుక్క సోమవారం స్వైర విహారం చేసింది. చిన్నా, పెద్ద తేడా లేకుండా కనిపించిన వారిని కరచుకుంటూ వెళ్లింది. దీంతో గాంధీనగర్ వాసులు భయాందోళన చెందారు. వేసవి సెలవులు కావడంతో రోడ్డుపై ఆడుకుంటున్న చిన్నారులతోపాటు పలువురి మహిళలపై కుక్క దాడి చేసింది. కనిపించిన వారిని కరిచింది. తలపై, చేతులు, పిక్కలపై కుక్కకాట్లు వేసింది. గాయపడ్డ చిన్నారులను తల్లిదండ్రులు నిడదవోలు ప్రభుత్వాసుపత్రికి తీసుకువెళ్ళారు. వైద్య సిబ్బంది వారికి ప్రథమ చికిత్స అందించారు. కుక్క కాటుకు గాయపడిన వారిలో మహమ్మద్ షాపిల్, కె.మోక్ష విహాన్, ఆర్.స్టీఫెన్‌లతో పాటు ఎ.లక్ష్మీ, సీహెచ్ సేతు, వి.అనుషలకు వైద్య సేవలు అందించారు. వీరందరికీ యాంటీ రాబిస్ (ఏఆర్‌వీ) ఇంజెక్షన్ చేసి పంపించారు. గాంధీనగర్‌లో కొంత కాలంగా కుక్కల బెడద అధికమైంది. ఎక్కడ పడితే అక్కడ వీధి కుక్కలు తిరుగుతూ స్థానికులను భయాందోళనకు గురి చేస్తున్నాయి. గతంలో వీధి కుక్కలను నివారించాలని మున్సిపల్ అధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదని చిన్నారుల తల్లిదండ్రులు అంటున్నారు. మున్సిపల్ అధికారులు చర్యలు చేపట్టి వీధి కుక్కల నుంచి రక్షించాలని వారు కోరుతున్నారు.

స్ట్రాంగ్‌రూమ్‌కు పోస్టల్ బ్యాలెట్లు

కాకినాడ: పోస్టల్ బ్యాలెట్‌లను సోమవారం జేఎన్‌టీయూకే ఆవరణలోని స్ట్రాంగ్‌రూమ్‌కు తరలించారు. ఎన్నికల విధుల్లో ఉండి పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కు వినియోగించుకున్న ఉద్యోగులకు సంబంధించిన పోస్టల్ బ్యాలెట్లు సిటీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి జె.వెంకటరావు పర్యవేక్షణలో ఇప్పటి వరకు నగరపాలక సంస్థ కార్యాలయంలో భద్రపరిచారు. వీటిని జేఎన్‌టీయూకేకు తరలించారు.



రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో పోస్టల్ బ్యాలెట్‌ను తరలిస్తున్న దృశ్యం

నేడు ట్రాఫిక్ మళ్లింపు

- ఉదయం 4 గంటల నుంచే అమలు
- కౌంటింగ్‌కు వచ్చే వాహనాలకు నిర్ణీత పార్కింగ్ స్థలాల ఏర్పాటు
- తూర్పు గోదావరి జిల్లా ఎస్పీ జగదీష్

కంబాలచెరువు(రాజమహేంద్రవరం): ఎన్నికల కౌంటింగ్ నేపథ్యంలో సోమవారం తూర్పుగోదావరి జిల్లాలో ఉదయం 4 గంటల నుంచే ట్రాఫిక్ మళ్లిస్తున్నారు. దీనికి సంబంధించి జిల్లా ఎస్పీ పి.జగదీష్ ప్రకటన విడుదల చేశారు. రాజానగరం నేషనల్ హైవేలోనున్న ఆదికవి నన్నయ యూనివర్సిటీలో సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ జరగనున్న నేపథ్యంలో అటుగా వచ్చే, వెళ్లే వాహనాల దారులన్నీ మళ్లించారు.

విశాఖ నుంచి రాజమహేంద్రవరం మీదుగా విజయవాడ వైపు వెళ్లే వాహనాలకు..

- హైదరాబాద్ వైపు వెళ్లే భారీ వాహనాలు రాజానగరంలోని కలవచర్ల జంక్షన్, ఏడీబీ రోడ్డు మీదుగా కాకినాడ వైపు వెళ్లి ఎస్‌టీ రాజాపురం జంక్షన్ వద్ద నుంచి బలభద్రపురం, అనపర్తి, కెనాల్ రోడ్డులో కడియం, వేమగిరి జంక్షన్ మీదుగా రావులపాలెం వైపు వెళ్లాలి.
- హైదరాబాద్, విజయవాడ వైపు వెళ్లే సాధారణ ద్విచక్ర వాహనాలు, కార్లు, ఆటోలు, బస్సులు నరేంద్రపురం జంక్షన్ నుంచి నందరాడ, దోసకాయలపల్లి, బూరుగుపూడి, ఎయిర్‌పోర్ట్, కొంతమూరు మీదుగా నేషనల్ హైవే 16పై కొంతమూరు వద్ద టర్న్ తీసుకొని కొవ్వూరు మీదుగా వెళ్లాలి.

ఆర్టీసీ బస్సులు

- ఏపీఎస్ ఆర్టీసీకి చెందిన బస్సులు, విశాఖపట్నం నుంచి విజయవాడ వైపు వెళ్లే వాహనాలు నరేంద్రపురం జంక్షన్ నుంచి నందరాడ, దోసకాయలపల్లి, బూరుగుపూడి, ఎయిర్‌పోర్ట్, కొంతమూరు మీదుగా దివాన్ చెరువు జీరో పాయింట్ నుంచి నేషనల్ హైవే 16కు వెళ్లాలి.
- ఏపీఎస్ ఆర్టీసీ బస్సులు రాజమహేంద్రవరం వైపు నుంచి విశాఖపట్నం వైపు వెళ్లేందుకు జీరో పాయింట్ నుంచి కొంతమూరు, ఎయిర్ పోర్ట్, బూరుగుపూడి, దోసకాయలపల్లి, నందరాడ, నరేంద్రపురం జంక్షన్ మీదుగా నేషనల్ హైవే 16కు వెళ్లాలి.

విజయవాడ వైపు నుంచి రాజమహేంద్రవరం మీదుగా విశాఖపట్నం వైపు వెళ్లే వాహనాలకు...

- హైదరాబాద్, విజయవాడ వైపు నుంచి విశాఖపట్నం వైపు వెళ్లే వాహనాలు కొవ్వూరు మీదుగా, కొంతమూరు వద్ద హైవేపై నుంచి సర్వీస్ రోడ్డు మీదుగా కిందకు దిగి ఎయిర్ పోర్ట్, బూరుగుపూడి, కోరుకొండ, గోకవరం, కొత్తపల్లి, మల్లిసాల, జగ్గంపేట మీదుగా నేషనల్ హైవే16కు వెళ్లాలి.
- రావులపాలెం వైపు నుంచి విశాఖపట్నం వైపు వెళ్లే వాహనాలు లాలాచెరువు, దివాన్ చెరువు జీరో పాయింట్ వద్ద టర్న్ తీసుకొని కొంతమూరు వద్ద హైవే పై నుంచి సర్వీస్ రోడ్డు మీదుగా కిందకు దిగి ఎయిర్ పోర్ట్, బూరుగుపూడి, కోరుకొండ, గోకవరం, కొత్తపల్లి, మల్లిసాల, జగ్గంపేట మీదుగా నేషనల్ హైవే16 కు వెళ్లాలి.
- రాజమహేంద్రవరం నుంచి కాకినాడ వైపు వెళ్లే వాహనాలు వేమగిరి, కడియం, ద్వారపూడి మీదుగా వెళ్లాలి.
- కాకినాడ నుంచి రాజమహేంద్రవరం వైపు వెళ్లే వాహనాలు సామర్లకోట, బిక్కవోలు, ద్వారపూడి, కడియం, వేమగిరి మీదుగా వెళ్లాలి.
- విజయవాడ వైపు నుంచి విశాఖపట్నం వైపు వెళ్లే భారీ వాహనాలు దేవరపల్లి డైమండ్ జంక్షన్ వద్ద గల ఖాళీ స్థలంలో సోమవారం తెల్లవారుజాము 4 గంటల నుంచి తిరిగి ఉత్తర్వులు వచ్చే వరకు నిలుపుదల చేశారు.

పార్కింగ్ ప్రదేశాలు

- రాజమహేంద్రవరం వైపు నుంచి వచ్చే రాజకీయ పార్టీల కౌంటింగ్ ఏజెంట్‌లు దివాన్‌చెరువు ఫ్రూట్ మార్కెట్ ఎదురుగానున్న నేషనల్ హైవే 16 రోడ్డుకు తూర్పు వైపున గల డీవీబీ రాజు ఖాళీ స్థలంలో వాహనాలు పార్కు చేసుకోవాలి. అక్కడ నుంచి జిల్లా ఎన్నికల అధికారి ఏర్పాటు చేసిన వాహనంలో ఏజెంట్లు సంబంధిత నియోజకవర్గ కౌంటింగ్ హాల్ వద్దకు చేరుకుంటారు.
- రాజానగరం వైపు నుంచి వచ్చు రాజకీయ పార్టీల కౌంటింగ్ ఏజెంట్‌లు రాజానగరం దుర్గమ్మ గుడి జంక్షన్ దగ్గర గల ఖాళీ స్థలంలో వాహనాలు పార్కింగ్ చేసి, అక్కడి నుంచి జిల్లా ఎన్నికల అధికారి ఏర్పాటు చేసిన వాహనంలో ఏజెంట్లు సంబంధిత నియోజకవర్గ కౌంటింగ్ హాల్ వద్దకు చేరుకోవాలి.
- రాజమహేంద్రవరం వైపు నుంచి వచ్చు కౌంటింగ్ ఆఫీసర్లు, సిబ్బంది, మీడియా మిత్రులు గైట్ కాలేజ్ గ్రౌండ్‌లో వాహనాలను పార్కింగ్ చేసుకుని, అక్కడ నుంచి జిల్లా ఎన్నికల అధికారి ఏర్పాటు చేసిన వాహనంలో సంబంధిత నియోజకవర్గ కౌంటింగ్ హాల్ వద్దకు చేరుకోవాలి.
- రాజానగరం వైపు నుంచి వచ్చే కౌంటింగ్ ఆఫీసర్లు, సిబ్బంది గైట్ కాలేజీ గ్రౌండ్‌లో వాహనాలను పార్కింగ్ చేసుకోవాలి. అక్కడ నుంచి జిల్లా ఎన్నికల అధికారి ఏర్పాటు చేసిన వాహనంలో సంబంధిత నియోజకవర్గ కౌంటింగ్ హాల్ వద్దకు చేరుకోవాలి.
- రాజానగరం, రాజమహేంద్రవరం నుంచి వైపు నుంచి వచ్చే ఆర్‌వో, ఏఆర్‌వోలు, పోటీ చేసిన అభ్యర్థులు, చీఫ్ ఎలక్షన్ ఏజెంట్స్ వాహనాలు నన్నయ యూనివర్సిటీ మైయిన్ గేట్ ఎదురుగా నున్న ఖాళీస్థలంలో పార్క్ చేసుకోవాలి. అక్కడ నుంచి మెయిన్ గేట్‌కు చేరుకొని జిల్లా ఎన్నికల అధికారి ఏర్పాటు చేసిన వాహనంలో సంబంధిత నియోజకవర్గ కౌంటింగ్ హాల్ వద్దకు చేరుకోవాలి.
- రాజానగరం, రాజమహేంద్రవరం నుంచి వైపు వచ్చే పోలీస్ అధికార్లు, ఇతర శాఖలకు సంబంధించిన సిబ్బంది వాహనాలు గణపతి సత్యానంద గురుదత్త ఆశ్రమంలోని ఖాళీస్థలంలో పార్కింగ్ చేసుకోవాలి. అక్కడ నుంచి మెయిన్ గేట్‌కు చేరుకుని, జిల్లా ఎన్నికల అధికారి ఏర్పాటు చేసిన వాహనంలో విధి నిర్వహణకు చేరుకోవాలి.